# ‘సెబాస్! వాలునబడ్డావన్నమాటే....’

— రా॰ భరద్వాజ —

ఒక్కొక్క పోలీసూ తను పట్టుకొన్న కేసులను ఇనస్పెక్టరు ముందుంచుతున్నాడు. ఇనస్పెక్టరు వాళ్ళ చాకచక్యాలను, తెలివితేటలను మెచ్చుకొంటూ భవిష్యత్తులో వారి కెలాంటి ఉజ్వల పదవులు రాబోతున్నయ్యో సిగరెట్టు పొగలో వూహించి చెబుతున్నాడు. వాళ్ళలోని క్రూరత్వాన్ని తగ్గకుండా వుంచడానికి ఇలాంటి అభినందనలు ఏఏ మోతాదుల్లో ఇవ్వాలో ఇనస్పెక్టరుకు బాగా తెలుసు. అందుకే కొందరికి అభినందనలు, కొందరికి చిరునవ్వులు, మరికొందరకు కరస్పర్శలు విడుదలచేస్తూ అతను తన ఇనస్పెక్టరు పదవిని పొడిగించగల్గుతున్నాడు.

తనకు కుడిప్రక్కగా వున్న నలుగురు పోలీసులూ అయితే ఇక మిగిలిందతనే! వాళ్ళందరూ పదులు, ఇరవైలు సంఖ్యల్లో కేసులను ఇనస్పెక్టరు ముందుంచుతుంటే తను మాత్రం ఏమీ లేకుండా వొట్టిచేతుల్తో ఇనస్పెక్టరువద్దకు ఎట్లా పోగలుగుతాడు? ప్రథమంలో తననుగురించి ఇనస్పెక్టరు అట్టే పట్టించుకొనేవాడు కాదు—

"కొద్దినెలల క్రిందటే చేరావు. మరో నాలుగురోజులు పోతే అన్ని విషయాలు నీకే తెలుస్తయ్" అన్నాడు ఇనస్పెక్టరు.

నాలుగురోజులు కాదుగదా నాలుగునెలలైనా తనకు తెలియలేదు. న్యాయానికి బెజవాడ వంటి పెద్దపెద్దపట్టణాల్లో ఒక సాధారణ పోలీసుకు కేసులు చిక్కకపోవు. ఎక్కువ శ్రమా, పరిశోధనా లేకుండానే రోజుకి అధమం పదికేసులైనా దొరుకుతయ్. సైకిల్ రాంగ్‌సైడ్ నడపడం, జట్కా రోడ్డుపక్కగా ఆపడం, పల్లెటూరి ఆసామీ నిషిద్ధ(?) ప్రదేశాల్లో మూత్రవిసర్జన చేయడం, మార్కెట్లోని గోంగూర అమ్మి కుళ్ళు ఆకును నడిరోడ్డుమీద దిమ్మరించడం, ఇవన్నీ కేసులే! వీటిలో కొన్నయినా తను ప్రతిరోజూ చూస్తూనేవున్నాడు. తను ఎదురుగా అనేక జట్కాబళ్ళు రోడ్డు కడ్డంగా పోతున్నయ్. వంద సార్లయినా సైకిల్ రాంగ్‌సైడ్డున పోవడం తను చూచాడు. కానీ......

తనతోటి పోలీసు వెంకటసుబ్బయ్య మొన్న సాయిబుని పట్టుకొన్నందుకు ఇనస్పెక్టరు ఎంతగానో అభినందించాడు. రహిమాన్ సినిమా బుకింగ్ దగ్గర కాపలా కాసి పదహారుసంవత్సరాల వయస్సుగల జేబుదొంగను పట్టుకొని ఎంతగానో ప్రశంసింపబడ్డాడు. వాడు, "అయ్యా! నేను దొంగను కాదు. మాది దగ్గర్లోవున్న పల్లెటూరు. సినిమా చూడ్డంకోసరం వొచ్చా"నని ఎంతగా ఏడ్చినా, కాళ్ళావేళ్ళా బడ్డా విడిపించని అతని బుద్ధికి సర్కిల్ ఎంతగానో పొగిడాడు. అవన్నీ తనకు తెలుసు. కానీ వాళ్ళలాగా తయారుచేయబోయేసరికి గుండెలు దూసుకుపోయే నేరస్థుల(?) చూపులు తనను నిలువునా కరిగించేయి. వాళ్ళ కళ్ళల్లోని తడిసిన గీరలు తనను కుదించి విదిపేయి...

"రామయ్యా!" ఇనస్పెక్టరు గొంతు.

ఆలోచిస్తున్న రామయ్య వులిక్కిపడ్డాడు.

"సార్" సిగ్గుతో బరువుగా అంగలు వేస్తూ సాల్యూట్ చేసి నిలబడ్డాడు.

ఇనస్పెక్టరు గొంతు పలికింది—

"మామూలేగదూ?"

ఇనస్పెక్టరు పొడుగ్గా వూపిరి వొదిలి, చెమటతో తడిసిన చొక్కాను గాలికి గుండీలు విప్పాడు.

"లాభంలేదు......ఇప్పటికి చాలాసార్లు నీకు హెచ్చరిక నిచ్చాను...ప్రథమంలో కొత్తవాడి వనుకున్నాను. తరవాత మెళుకువలు తెలియకవనుకున్నాను...వాటినిగురించి అవసరమైన సంఖ్యకంటే ఎక్కువగా నీకు బోధించాను...లాభం లేదు. నిన్ను ప్రభుత్వంవారు వూరికే గాదు మేపడం!...వారంరోజుల్లోగా అరడజను కేసులన్నా నీవు పట్టుకోకపోతే నీ అసమర్థతనుగురించి పైకి రాయవలసివుంటుంది. డి. యస్. పి నిన్ను పని నుండి తొలగిస్తే బాధ్యత నాదిమాత్రం కాదు."

ఆఖరిసారిగా సిగరెట్టును లాగి కిటికీగుండా బైటికి విసిరాడు...

రామయ్యకాళ్ళు చల్లబడ్డయ్. తనెంతో కష్టపడి ఈ నౌకరీని సంపాదించాడు. తన తల్లికీ, విధవచెల్లెలుకూ, కొత్తభార్యకూ ఈ పట్టణంలో కూడు పెడుతుంది ఈ నౌకరీ! ఇది పోతే తన భవిష్యత్తేమిటి? ఇప్పుడు దొరికే చాలీచాలని మెతుకులుగూడా కంటికిదూరంగా జరుగుతయ్. మరి వాటికోసం తనెక్కడ నేరస్థులను పిండ గలుగుతాడూ?

రామయ్య హృదయం అంగీకరించలేదు. "పోనీ పనినుండి తొలగించండి" ఇనస్పెక్టరు వైపు తిరిగాడు. గొంతులోనుండి మాట ఇంకా వెలికి రానేలేదు. ఇనస్పెక్టరుకు బదులుగా తన కుటుంబం అక్కడ వుంది. తనభార్య నొప్పులు పడుతోంది "ఇంజెక్షనివ్వాలి" అన్నాడు డాక్టరు. తను జేబులో చెయిబెట్టాడు. అది వెక్కిరిస్తో వెలికివచ్చింది. తల్లి మంచానికి అంటుకు పోయింది.

"అబ్బాయ్! బియ్యం తెచ్చావా?" శబ్దం పోగలేక ముసిలిగొంతులోనే సుళ్ళు తిరిగింది. చెల్లెలు గుడ్డలేక తన ఎదటికి రా సిగ్గుపడుతోంది. ఇంటికప్పు ఏ క్షణానైనా కూలిపోవచ్చు—

"అఁహా... వొద్దు... వొద్దు" గట్టిగా కళ్లు మూసుకొన్నాడు పోలీసు రామయ్య.

"ఏం?...ప్రయత్నించు!... నీ అదృష్టం... ఆనక నన్ను నెపబెట్టి లాభంలేదు" కుర్చీలో మెడవాల్చుకొన్న ఇనస్పెక్టరు అన్నాడు.

"తప్పకుండా ప్రయత్నిస్తాన్ సార్."

"గుడ్...వెళ్లు" రాతలో మునిగాడు ఇనస్పెక్టరు.

## 2

పోలీసు రామయ్య ఠెక్కుగా క్రసు వూపు కొంటో అటూఇటూ చూచాడు. ఇంతవరకు అల వాటులేకపోవడంచాత కేసులు పట్టుగోవడమంటే కొంచెం బిక్కుబిక్కుగా వుంది. ధైర్యం వొచ్చేందుగ్గాను కొండమూడు కరింబీడీలు తాగాడు. నాలుగైదు దఫాలు గట్టిగా సినిమాపాటలు పాడుకొన్నాడు...

పొద్దుగూక వొచ్చింది. తనింతవరకూ ఏ కేసూ పట్టుకోలేదు...మధ్యాన్నం గుర్రబ్బండి వొకటి రాంగ్ సైడ్న పోతోంది. తను కేకేశాడు. "హుస్సాం మహరాజ్"-జట్కా నెంబరన్నా నోట్ చేసుకోవడానికి అవకాశంలేకుండా-పోయింది. కాలేజ్ కుర్రాళ్లు ముగ్గురు కలిసి వొకే సైకిలును తొక్కడం చూచాడు. తను అరిచేలోపుగానే వాళ్ళు తన కేకకు అందకుండా పొయ్యారు.

మళ్ళెట్లా?

తన వుద్యోగం...భార్య...తల్లి?

చీకటిపడింది.

తనెల్లాగైనా ఈ రోజు వొక కేసు పట్టుకొని తీరాలి. మానికలాంటి టోపీని తీసి నెత్తిమీది చెమటను తుడుచుకున్నాడు. ఆలోచన ప్రాకేందుకు బీడీ ముట్టించాడు. బీడీ పొగను దూసుకొంటూ "గల్ గల్" మనే శబ్దం వినిపించింది. పోలీసు రామయ్య చూచాడు.

రిక్షా!

దానికి లైటులేదు! భలే చక్కని కేసు.

బీడీని గిరవాటు కొట్టి గబగబా ముందుకు పొయ్యాడు.

"అరేయ్!"

రిక్షావాడు కుంగిపొయ్యాడు. వాడి నోరు ఎండిపోయి పిడచ గట్టింది.

"లైటేదిరా?" క్రూరత్వాన్ని తనకు వీలై నంత ఎక్కువగా గొంతులోకి తెచ్చుకొన్నాడు.

"ఎక్కడా కిరసనాయిలు దొరకలేదండీ."

నిజమే పాపం! తనకే కాయదొరకడం గగన మైపోయింది. గాంధీజీ కిరోసిన్ షాపు యజమాని అరణాలు తీసుకొని అరకాయమడ్డి పోశాడు తనకు...

"సరే ఆ సంగతే ఇనస్పెక్టరుగారితో చెబుదువుగాని నడు."

రిక్షావాడు కూలిపోయాడు.

"నడువ్" లాఠీతో నడుం చివచివమంది రిక్షావాడికి.

ఇనస్పెక్టరు రామయ్య తెలివికి సంతోషించాడు.

"సెహబాస్...వాణ్ణిబట్టావన్నమాట!... ఇంతే? ఇదే పద్ధతి...వెరీగుడ్" భుజం తట్టాడు.

రామయ్య సంతోషభారంచేత అడుగులు మెల్లిగా వేసుకొంటూ ఇంటికి చేరిన సమయానికే రిక్షావాడి పెళ్లాం ఏడుస్తున్న ఇద్దరుపిల్లలను వెంటేసుకొని మొగుడికోసం బయలుదేరింది.